ణ్ణించి వెళ్ళిపో! కల్యాణీ; రత్నం—(అని అరుచుకుంటూ వెళ్లిపోతుంది)

పు: లలితా! నువ్వేం కంగారు పడకు. మన కడుపు చించుకుంటే మనకాళ్ళమీదే పడుతుంది. నీకే సహాయం కావలసినా నేను చేస్తాను తల్లీ!

ల: ఎంతమాట నాన్నా; అమ్మతో నాకేమైనా వైరమా?

పు: ఎప్పుడూ ప్రయాణం?

ల: ఈ రాత్రిబండికే అంటున్నారు ఆయన!

పు: శుభస్య శీఘ్రం అన్నారు. తప్పకుండా వెళ్ళు తల్లీ! మళ్ళీ ఎప్పుడు తలుచుకుంటే అప్పుడే రావచ్చును;

(లలితక్కయ్యా అని అరుచుకుంటూ కల్యాణీ రత్నం వస్తారు)

రత్నం: ఊరెళ్ళిపోతావా లలితక్కయ్యా?

కల్యాణి: ఈ రాత్రేనా ప్రయాణం?

లలిత: అవును.

ర: నేనూ నీతో వస్తాను లలితక్కయ్యా!

క: ఏడిశావ్! చదువక్కర్లేదా యింక?

ర: అక్కడే చదువుకుంటాను.

క: అక్కడ కాలేజీ లేదు.

ర: పోనీ మానేస్తాను. నేను లలితక్కయ్య దగ్గిర ఉండిపోతాను. అన్నట్టు లలితక్కయ్యోయ్! సిల్వర్ సెంట్ స్ప్రే పోయిందనుకున్నామా-మన పెట్లో నే ఉంది.

ల: మరి ఆనాడు నువ్వేమన్నావురా?

ర: అయాంసారీ లలితక్కయ్యా; అప్పుడేదో అనేశాను...నువ్వు పోతావంటే నాకెందుకో బెంగగా ఉంది. నేనూ నీతో వచ్చేస్తాను.

పు: లలితా! ఈ సెలవులకి వెళ్ళిరావడంవల్ల కనీసం నువ్వైనా కళ్ళు తెరిచావు. నాకు సంతోషంగా ఉంది.

ల: నిజం నాన్నా! ఇంతవరకూ ముల్లులేని గడియారంలాగ ఏమిటో టిక్కు టిక్కుమంటున్నా—అర్థంలేని జీవితాలు గడిపామనిపిస్తోంది;

క: అనిపిస్తుంది-అనిపించదూ; అదంతా బావగారి మహాత్యం!

సుందరమ్మ: (ప్రవేశిస్తూ) ఏవిట్రా రత్నం అంటున్నావ్?

ర: ఏంలేదు మమ్మీ! నేను అక్కయ్య దగ్గిరుండి చదువుకుంటాను; లలితక్కయ్యని వదిలి నేను ఉండలేను.

సుం: నువ్వుకూడానా! సెలవుల్లో ప్రయాణం చివరికెంత కొంపముంచింది!

ల: ఏం ముంచలేదు. కొందరికి జీవితం అంటే ఏమిటో కనువిప్పు కలిగించింది. అంతే.

(సముద్రఘోష సూచించే వాద్య ధ్వని.)

(సమాప్తం)

కథానిక

# సింహాద్రి మీద అధికారి

బి. వి. రమణారావు

పదిమైళ్ళు సైకిలు తొక్కిన ఆయాసం తగ్గడానికి గేటవతల గోడపక్క నిలబడి, బీడీ వెలిగించాను. బీడీపొగ గుండెల్లో సుడిగాలి తిరుగుతుంటే ఆలోచించాను మా కొత్త ఆఫీసరు రమ్మని ఎందుకు కబురంపించాడా అని. ఇంతలో "అయ్యగారు రమ్మంటున్నారు. రావయ్యా" అంటూ లోపలికి ఆహ్వానించాడు కొండయ్య. అమృత తుల్యమైన ఆఖరి దమ్ము లాగేసి డవాలీ వెనకాలే వెళ్ళాను.

"శంకరం కాదూ నీ పేరు?" అన్నాడు ఆఫీసరు. మరి రిజిష్టరు చూశాడో లేకపోతే నాలాంటి చిరుగుల గళ్ళ కోటు వేసుకున్నవాళ్ళందరికీ అదే పేరుంటుందో తెలియదు!

"చిత్తం" అన్నాను, స్తంభం చాటునుంచి ఎదుటికొచ్చి చేతులు కట్టుకుని.

"నేను ఎల్లుండి సింహాచలం క్యాంపు వేసుకుంటున్నాను." విశాఖపట్నం కొత్తగా ట్రాన్స్ఫరు అయిన ప్రతీ ఆఫీసరుకీ ఇది పరిపాటే.

"చిత్తం" అన్నాను.

"సింహాచలం మహా క్షేత్రమనీ స్వామి మహాత్యం కూడా చాలా గొప్పదనీ విన్నాను."

"చిత్తం" అన్నాను, నా పదహారు సంవత్స

రాల సర్వీసులోనూ కంఠోపాఠంచేసిన వేదాక్షర ద్వయాన్ని మళ్ళీ వర్ణిస్తూ.

"నీ చిత్తానికేం లేవయ్యా. దొరగా రంటున్నదదికాదు. మన భద్రయ్యగారితో ఆపూట కారు రేపు సాయంత్రాని కిక్కడకి పంపమని చెప్పి అక్కడ క్యాంపులోకి పూజకీ కావల్సిన ఏర్పాటు నేయించు" అన్నాడు కొండయ్య తలపాగా సవరించుకుంటూ.

ఆయన సాంకేతిక భాష అర్థమయినట్లు తలూపుతూ ఆయనకేసి తిరిగి "ఆయ్" అన్నాను మరో పర్యాయ పదం ఉపయోగిస్తూ.

"ఎల్లుండి తెల్లారేటప్పడి కల్లా అక్కడుంటాం" అన్నా డాఫీసరు.

"అమ్మగారు, అయ్యగారూ, అయ్యగారి అక్కగారు వస్తారు. సరింగా ఆరవ్వేళేళకి కాఫీ, ఫలారం పట్టుకుని బంగాళాకాడ సిద్ధంగా వుండాలి" అన్నాడు కొండయ్య మళ్ళీ వ్యాఖ్యానం చేస్తూ.

మరో రెండు 'చిత్తం' ప్రయోగాల్తో బయటపడ్డాను. ఇన్నాళ్ళకి తిట్లు తినకుండా ఆఫీసరు ఎదుట్నుంచి బయటపడ్డానన్న విజయగర్వంతో ఒక్క ఊపుతో సైకిలెక్కాను. ఎప్పుడూ మోగని సైకిల్ బెల్ టంగుమని మోగింది.

* * *

ముందు మా ఆఫీసరు, ప్రక్కనే భద్రయ్య, వెనకాల ఆఫీసరు భార్య, అక్కగారు, వాళ్ళ వెనకాల కొంచెం ఎడంగా నేనూ కొండయ్యా మెట్లెక్కుతున్నాము. మా ఆఫీసరూ ఆయన భార్య అసలే సుకుమారులు, అందులోనూ స్థూలకాయులు. పైగా ఎండ మాడ్చేస్తున్నది. దానాదీనా మేము సగం మెట్లెక్కేటప్పటికి మాతో ముద్దేరినవాళ్ళు ప్రసాదాలు తీసుకొని ఎదురొస్తున్నారు. కాస్సేపటికి మార్గాయాసంతో అందరూ చతికిలబడ్డారు. కొంచెం దిగువుగా చెట్టుచాటున పక్క నేనూ కొండయ్యా బీడీలు వెలిగించాము. అక్కడ పరిసర ప్రాంతాల్లో బట్టలు పరుచుకున్న ముష్టాళ్లు, నేనూ కొండయ్య ఎంత అర్చినా వినకుండా మా ఆఫీసరు కుటుంబం మీద దండయాత్ర చేశారు. ఇంక లాభంలేదని తెగించి భద్రయ్యగారు చేడకాసుమార్చి దగ్గిరకొచ్చి అందుకొగలిగిన వాళ్ళలో ఓ అరడజనుమందికి తలో కానీ పడేసి మిగతా రెండుకాన్లూ జేబులో వేసుకుని మిగతావాళ్ళని కసిరి పొమ్మన్నాడు.

ఇది చూసిన మా ఆఫీసరు "అబ్బబ్బ... ఈ ముష్టి వెధవల్ని చూస్తే నాకు మహాఅసహ్యమండీ. ఎక్కడికెళ్ళినా ఈగల్లా మూగడం. పొమ్మనంటే పోరు. ఎంతమందికనీ వెయ్యడం? దయతల్చి ఒకళ్లిద్దరికి వేస్తే, మిగతావాళ్ళపీడ ఒదిలించుకోడం మనతరంకాదు. అదుగో చూడండి. ఆ వెధవ. ఇందాకణ్ణించి ఇంతమంది నయాన్నీ, భయాన్నీ చెబుతున్నామా? ఇంకా దగ్గిరికి డేకుతున్నాడే కాని పోడు...అసలు మీరు మొదలెట్టకుండా వుండవల్సింది భద్రయ్యగారూ... నేనుఎందుకు మానేశాననుకున్నారూ?" అన్నాడు.

దీంతోటి భద్రయ్యగార్కి చచ్చినంతపనైంది పుణ్యానికెడితే పాపం ఎదురయింది, ఈ ఆఫీసరు కోసం తను తగలేసిందాంట్లో ఈ ముష్టి వెధవలకి పారేసీ దొంతలే అన్న ధీమామీద చేసిన ఈ కాస్త ఘనకార్యానికి వొచ్చిన ప్రతిఫలంతోటి నీళ్లు కారిపోయాడు.

"చిత్తం. చిత్తం. అంతేనండి. పోరా వెధవాఫో. నీకు కాదూ చెబుతుంటే...ఊఁ..." అంటూ గదమాయించాడు భద్రయ్య ఆ కుంటివాణ్ణి.

వాడుమాత్రం కదల్లేదు. ఈ పీడ వొదిలించుకోడానికి, అప్రయత్నంగా భద్రయ్య చెయ్యి జేబులో చిల్లరమీదికి పోయింది. అనుమానంగా మా ఆఫీసరిదిచూసి "ఏమిటి? మళ్ళీతీస్తున్నారా?" అన్నాడు.

"అబ్బెబ్బె."

"అసలీ ముష్టి వెధవలకి ధర్మం చెయ్యకూడదండి."

"చిత్తం. చిత్తం" అన్నాడు తన తప్పిదానికి పశ్చాత్తాపపడుతూ,

"కిందటిజన్మలో ఏ ఘోర మహాపాతకాలో చేసి యీ జన్మలో యిలా అనుభవిస్తున్నారు. వీళ్ళ నిలా అనుభవించ నివ్వవలసిందే."

"ఎందుకండీ యీ జీవాలు సుఖపడాలి కనకనా? నన్నడిగితే వీళ్ళనో తుపాకితో..."

"అబ్బెబ్బె...అది మళ్ళీ పాపం" తనలోని దయారసాన్ని చవిచూపిస్తూ అన్నాడు మా

ఆఫీసరు "వాడికర్మ పరిపక్వమయ్యేవరకూ వాడినలా బాధలుపడ నివ్వవలసిందే."

"చిత్తం" అన్నాడు భద్రయ్య కొంచెం నిరుత్సాహంగా. మొత్తంమీద ఆ కుంటివాడుమాత్రం తన వాక్చాతుర్యాన్ని కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ తన జన్మహక్కుకోసం ఏకగ్రీవంగా పోరాడుతున్నాడు. దీనితోటి మా ఆఫీసరు మొహం, భద్రయ్య మొహంకూడా ఎర్రపడిపోయాయి. ఇక పరిస్థితి స్పృతిమించి రాగాన్ని పడుతుందేమోనని నేనూ, కొండయ్యా గబగబ వెళ్ళి ఆడేకీ కుంటాణ్ణి చెరో జబ్బా పట్టుకుని వాడి బట్టదగ్గిరకి మోసుకెళ్ళి పారేశాం.

ఇదంతా చూసిన తర్వాత కలిగిన చైతన్యం చేత కాబోయి, మా ఆఫీసరు "నిజం చెప్పవల్సివొస్తే భద్రయ్యగారూ, ఈ కొండ లెక్కడం తీర్థాలకెళ్ళడం పాటకజనానికి కాని మనకికాదు. నిజానికి యీ దేవుడు మన హృదయంలో లేడూ? ఈ ముష్టివెధవల మధ్యనుంచి, అడ్డమైనవాళ్ళనీ రాసుకుపూసుకుని కాళ్లు పచ్చి పుళ్ళయ్యేలాగ ప్రయాసపడుతూ ఈ కొండలూ గోపురాలూ యెక్కడంకంటే నన్నడిగితే నిశ్చలంగా మన యింట్లో ఏ దేవుడిది కావలిస్తే ఆ దేవుడి విగ్రహము పెట్టుకుని హృదయం లగ్నంచేసుకుని పూజించడం ఉత్తమం అంటాను" అన్నాడు.

అసలే వ్యాపారంలో యీ మధ్య దెబ్బతిన్న భద్రయ్య ఇదివిని, పోనీ యీరకం ఖర్చులు తగ్గినా తగ్గడమే అన్న వుద్దేశంతోలాగుంది, కాస్త తేటపడ్డ మొహంతోటి "అబ్బే. అంతేనండీ" అన్నాడు.

ఇరవైమంది స్కూలు కుర్రాళ్ళని తన ఆధిపత్యంతో కొండెక్కిస్తూ మాకంటే పదిమెట్లు పైని చతికిలబడ్డ ఓ బట్టతల మేష్టారు ఇదంతావిని, మా ఆఫీసరుకేసీ భద్రయ్యకేసీ తీక్ష్ణంగా ఒక్కచూపుచూసి ఏదో గొణుక్కుంటూ లేచాడు. కుర్రాళ్ళందరూ ఒక్కసారి సింహాద్రి అప్పన్న చెవులు దిమ్మెత్తేలాగ "గోవిందా...గో,..వింద" అని మళ్ళీ మెట్లెక్కడం మొదలెట్టారు.

మొత్తంమీద కొండెక్కాము. మా ఆఫీసరు దంపతులు కొండధారలో స్నానాలుచేస్తున్నారు. మెట్లదగ్గిర నేను చతికిలబడ్డాను.

"అదుగోరోయ్!" పైకిచూశాను. మెళ్ళో కెమెరాతగిలించుకున్న కుర్రాడు మెళ్ళో ఫ్లాస్కు తగిలించుకున్న కుర్రాడితో అంటున్నాడు. "ఎవడో సకుటుంబంగా, కూసంవిడుస్తున్నాడు. అలా దగ్గిరగా వెళ్ళకు. కడిగేసుకుంటున్న ఆ పాపం తుంపర్లు మీదపడుతాయి"

"ఆఁ ద్రావకంలో ముంచినా పోని పాపాలు నీళ్ళతో కడిగేసుకుంటే పోతాయూ?" అన్నాడు ఫ్లాస్కు మెడ. వాలకమంతా చూస్తే కాలేజీ విద్యార్థుల్లా కనబడ్డారు. ఎందుకయినా మంచిదని కిక్కురుమనకుండా వూరుకున్నాను. కాని ఇంతలోనే ఆలోచనా అందులో అనుమానం కలిగేయి. ఈ పాపనాశనం ధారలో అంత మహత్తుందా? అయితే ఘోర మహాపాతకాలు చేసేసి అందులో ఓసారి స్నానంచేసేసి తుడిచేసుకుంటే పోతాయన్నమాట...?

సహస్రనామాలు చదివించడానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేయించి భద్రయ్యగారు ముందర దారితీశాడు. ఆ వెనక్కాలే అందరూ గర్భగుళ్లోకి బయల్దేరారు. వెనక్కాల పళ్ళూ, కుంకంవగైరా పళ్ళెంపట్టుకుని కొండయ్య వెళ్ళాడు. ఆరేసిన తడిబట్టల కాపలాకి నేను మండపంలో వుండిపోయాను.

ఆ మండపం చివర ఇందాకటి బట్టతలాయన హిస్టరీ మేష్టారులాగుంది. మోళీవాడు సంచీలోంచి తీసినట్టు నెమ్మదిగా లాల్చీ జేబులోంచి ఓ నారింజపండు రెండరిటిపళ్లూ బయటికితీశాడు... నా వెనక్కాల ఓ ముసలాయన అప్పుడే ప్రసాదం చేత్తో పట్టుకుని గర్భగుళ్ళోంచి బయటపడి మండపంమీది కొచ్చాడేమో చల్లగాలి తగిలేటప్పటికి "అహాహ! పరమేశ్వరా, పాహిమాం, పాహిమాం" అంటూ చతికిలపడ్డాడు. ఉ[illegible]ర క్షణంలోనే మాటల్లోకి దిగేము.

"ఏం బాబూ, తీరిగ్గా కూర్చున్నావు? దర్శనం చేసుకున్నావా?" అన్నా డాయన.

"మాదీవూరే...కొత్త ఏమీలేదండి."

"భగవద్దర్శనానికి కొత్తేమిటి పాతేమిటి? వెళ్ళి దర్శనం చేసుకుని తీర్థం పుచ్చుకురా నాయినా, ఇవ్వాళ శనివారం అందులోనూ ఏకాదశి."

"అలా గేనండి. మా ఆఫీసరు లోపలికెళ్ళారు

పూజ చేయించడానికి. ఆయన రాగానే..." అంటూంటే...

నాకేసి చటుక్కున తిరిగి "మీ ఆఫీసరంటే ఇందాకా మెట్లదగ్గిర చితికిలబడ్డ ఆ లావుపాటాయినేనా?" అన్నారు మేష్టారు.

"అవునండీ!"

"అదేమిటయ్యా! కొండెక్కే వాళ్ళందరూ పాతకజనం, ముష్టి వెధవలూ అంటాడు? అలాంటప్పుడు తనేం మొహం పెట్టుకుని వచ్చాడూ?"

"అబ్బెబ్బె, ముష్టాళ్ళందరూ వచ్చి మీదపడుతుంటే వాళ్ళమీద విసుక్కుంటూ తిట్టారండీ" అన్నాను.

"పాపం! వాళ్ళని తిట్టడం ఎందుకయ్యా చేతనయితే ధర్మం చెయ్యాలి లేకపోతే తనదార్ని తను పోవాలికాని" అన్నాడు ముసలాయన.

"అసలు ముష్టివెధవ కానివాడెవడండీ? ఆ ఆఫీసరుమాత్రం ముష్టివెధవ కాదూ? కావలసిన తట్టాబుట్టా తోటీ పుట్టుకొచ్చాడా? భూమిమీద పడ్డాక చచ్చేవరకూ, ప్రతీవాడూ ఏదో రకమైన ముష్టి ఎత్తవలసిందే" అందుకున్నారు మేష్టారు.

"బాగా చెప్పావు నాయనా.. ప్రాణ భిక్ష దేవుడూ, క్షీరభిక్ష తల్లీ, విద్యాభిక్ష తండ్రీ, బ్రతుకు తెరువు ప్రజలూ, అంత్యక్రియలు బంధు మిత్రాదులూ చెయ్యవల్సిందే కదా? ఇదంతా ముష్టి కాదూ?" సమర్థించాడు ముసలాయన.

మొదట్నుంచీ మేష్టారిప్రవర్తనమాత్రం చాలా వింతగావుంది. మాట్లాడుతున్నప్పుడు ఆయన మొహంలో ఆవేదనకాని, కోపంకాని, ఉద్రేకం కాని లేవు. ప్రశాంతంగా ఆయన నారింజపండు వొలుచుకుని తీరుబడిగా ఒక్కొక్క తొనా గింజలు తీసుకుని తింటూ మేము వింటున్నామో లేదో కూడా అక్కర్లేకుండా మొహమేనా మావైపు తిప్పకుండా మాట్లాడుతున్నాడు. ముసలాయనదృష్టి నామీదకి మళ్ళించాడు.

"నీకు సంతానమెంతమంది నాయినా?"

"ఏడుగురండి"అన్నాను నేరస్థుడిలాగ తలదించుకుని.

"బాగుందినాయినా...అదృష్టవంతుడివి."

నేను మాట్లాడలేదు.

ఇంతలోకి భద్రయ్యగారక్కడికొచ్చి డబ్బు నాచేతికిస్తూ "స్వామివారికి భోగంచేయించి ప్రసాదము పన్నెండుగంటల కిస్తానన్నాడు పూజారి. మీరెళ్ళి ఐదురూపాయిలూ యిచ్చి ప్రసాదం తీసుకురండి" అన్నాడు.

"ఐతే దొరగారు బైట కొచ్చేస్తున్నారా?"

"ఇంకో పదినిముషాల్లో వచ్చేస్తారు. అవును కాని ఆ సంతాన స్తంభం రేటెంతండీ?"

"మూడు రూపాయిలు. పైగా ఏవో సంభావనలూ, మామూళ్ళు వుంటాయండి" అన్నాను.

"సరే ఐతే అక్కడ ఏర్పాట్లన్నీ చేయిస్తూ వుంటాను. దొరగారు బయిటకు రాగానే మీరు బట్టలు పోగు చేసుకుని అందర్నీ అక్కడికి తీసుకు రండి" అన్నాడు భద్రయ్య. నేనేదో ఆలోచనలో పడ్డాను....

కొండయ్య కేక వినబడింది. బట్టలమూట తీసుకుబయల్దేరాను. "సంసారం... సాగరం... దుఃఖం..." ముసలాయన గొంతుక దూరంగా వినబడుతోంది. ఒక్క పరుగులో మా ఆఫీసరు కుటుంబాన్ని కలుసుకున్నాను. సంతానస్తంభం దగ్గిరకెళ్ళే దారిలో ఓ చిన్న వినాయకుడివిగ్రహం ఉంది. అక్కడ అర్చకుడు పళ్ళెం అడ్డంపెట్టేటప్పటికి, ఆఫీసరుగారు జేబులు తడుముకున్నారు. ఇంతలో భద్రయ్య అక్కడకొచ్చి ఇందాకా బేడ కాసు మార్చిముష్టాళ్ళకి పడెయ్యగా మిగిలిన రెండుకాన్లూ మా ఆఫీసరు చేతులో పెట్టాడు. తను వెయ్యకపోయినా యీ దేవుడు యేమీ అనుకోడనే ధీమామీద ఆ రెండుకాన్లూ అక్కగారిచేత, భార్యచేతా వేయించాడు. తర్వాత ప్రసాదంబాపతు ఓ కొబ్బరిచెక్క తీసుకోమని నాకిచ్చారు.

సంతానస్తంభానికి కొంచెం దూరంగా మండపంమీద అందరూ చతికిలబడ్డారు. సంతానం కలుగుతే ఏం పేరెట్టాలీ? అనే సమస్య వొచ్చి పడింది. కొండయ్య సింహాచలం దేవుడిపేరుకే వోటేశాడు. కొండయ్యకయితే యిబ్బందిలేదు. మగపిల్లాడు పుడితే 'అప్పన్న' అనీ ఆడపిల్లయితే 'అప్పలమ్మ'నీ నిస్సంశయంగా పేరు పెడతాడు. కాని లేకలేక పుట్టబోయే మా ఆఫీసరు సంతా

నానికి అలాంటి పేర్లు పెట్టడమంటే ఆయన మనస్సు చివుక్కుమనదూ?

"ముందర మొక్కుకోండమ్మా, తరవాత చూసుకుందాం" అన్నాడు కొండయ్య ప్రాణం విసిగి. చివరకి భద్రయ్యగారి సలహామీద మొగపిల్లాడు పుడితే "అప్పల నరసింహారావు" ఆడపిల్ల పుడితే "సింహాద్రమ్మ" అని పేరెట్టడానికి ఒప్పుకున్నారు.

మా ఆఫీసరుగారి భార్య సంతాన స్తంభం దగ్గిరకి వెళ్ళింది. ఒక్కసారి కళ్లు మూసుకున్నాను. వెయ్యిజ్యోతులు నాకళ్ళముంద రొక్కసారి వెలిగాయి, గుళ్ళో గంటలన్నీ ఒక్కసారి కంగుమని మోగాయి. అదేచోట ఎదురుకుండా నా ఏడుగురు పిల్లలూ నా భార్యచేతుల్లో కొబ్బరికాయి చెక్కకోసం చుట్టూచేరి పెనుగులాడుతున్నట్లు కనబడింది. ఎప్పటికో యీ దారిద్ర్యాని కంతం? ఇంతలో మరోదృశ్యం... జీవితంలోని కష్టాల ఫలితంగా బెరడుకట్టిన హృదయాలతో శిలాప్రతిమల్లాగ వుండే దంపతులు, వాళ్ళచుట్టూ దీనంగా నిలబడ్డ పెద్దకొడుకూ, తల్లిలేని నలుగురు అభాగ్యపు మనుమలు, కాలానికెదురీతలీదుతూ కుటుంబముకోసం త్యాగంచేస్తున్న రెండోకొడుకూ, క్షయరోగంతో చావు కెదురుచూస్తున్న మూడో కొడుకు, బ్రతుకు తెరువుకోసం సైన్యంలో చేరిన నాలుగోకొడుకు, భావి జీవితాల్ని గురించి అమాయికంగా మధుర స్వప్నాలుకాంచే బాల్యావస్థలో వున్న చిన్నకొడుకూ, చిన్నకూతురూ, దారిద్ర్య ఫలితంగా పండు యౌవ్వనాల్ని ముసలి భర్తల చేతుల్లోపెట్టి తీరని కోరికలతో, అవమానంతో కుమిలి కుమిలి యేడ్చే ఇద్దరు కూతుళ్లు, అంతకంటే అభాగ్యురాలయిన బాల్యవితంతువు, జీవితమొక దీర్ఘదుస్వప్నంగా పరిణమించిన గర్భవతయిన కోడలూ కనబడ్డారు. హుం... వారికి దేవుడుమీద నమ్మకమెలా వుంటుంది? దేవుడే వుంటే దొంగవర్తకులమీద చూపెట్టిన దయ, ఇలాంటి కష్టజీవులమీద చూపెట్టడేం?...మళ్ళీ మరోదృశ్యం... మెట్లపొడుగునా బట్టలుపరుచుకున్న కుంటి, గుడ్డి, మూగ భిక్షువులందరూ ఒక్కసారి ఎలుగెత్తి అరుస్తున్నారు. "ముందర మాకేసి చూసి తర్వాత దేవుణ్ణిచూడండి. ఆలయద్వారం ముందరే దేవుడి పాదాలదగ్గిరే ఆకలితో మలమల మాడి చస్తున్నాం. దేవుడు చేసేదేమీలేదు. మనిషికి మనిషే దిక్కు. ధర్మంచేసి ప్రాణాలు రక్షించండి."

మరో దృశ్యం... బేడ కాసుమార్చి అరకాన్లు ధర్మంచేసిన భద్రయ్య, ప్రాణంవిసిగి ఆ కుంటివాడికో కానీ వేద్దామనుకుంటే అడ్డంవొచ్చిన ఆఫీసరు, ఆ రెండుకాన్లూ విఘ్నేశ్వరుడి విగ్రహం ఎదుట తను తీసుకున్నాడు న్యాయంగా అందులో ఓ కాని ఆ కుంటాడి గుడ్డమీద పడాల్సింది. నిజానికి మనిషికి డబ్బుమీదున్న నమ్మకం దైవం మీద లేదు. తన అహంభావంచేత ఆ కుంటి కె కక్కడ కానీ వెయ్యనివ్వలేదు. అది దేవుడు మెచ్చుకుంటాడనే చేశాడా? న్యాయార్జితం కాని సొమ్ముతో తను చేసిన ఈ యాత్రలూ, పూజలూ, దానాలూ ఆ దేవుడు కళ్లుమూసుకుని స్వీకరిస్తాడనే చేశాడా? కాదు. మానవుడు ముందర రూపాయణాపైసలు లెక్కపెట్టుకుని మార్గమాలోచిస్తాడు. హుం... పైగా గతిలేక ముష్టెత్తుకునేవాళ్ళని తిట్టేడు. ఈ ఆఫీసరుమాత్రం ఆ కుంటాడిచేతిలోపడే కానీ తనులాక్కున్నాడు. ఆ దౌర్భాగ్యపు కుంటివాడు ముష్టివెధవైతే వాడి కానీ లాక్కున్నవాడి నేమనాలి?......"

నేను మళ్ళీ కళ్ళు తెరచేటప్పటికి ఆలయ మండపం యథాతథంగానే వుంది...

---

గోల్డు వ్యామోహం కూడదు,
మైల్డ్ వ్యాయామం శరీరమాద్యం ఖలుడా!
చైల్డ్ వ్యాపారం చెడ్డది,
ఓల్డ్ వ్యాలను హోల్డు చేయకుండవలె జరూ!

(శ్రీశ్రీ, ఆరుద్రల "రుక్కుటేశ్వర శతకం"నుంచి)